ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 22 జనవరి 2024



కారులో తరలిస్తున్న రూ.2.07 కోట్ల నగదు పట్టివేత

» ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసిన నక్కపల్లి పోలీసులు

- వార్త మెయిన్‌లో



నక్కపల్లి పోలీసులు సీజ్ చేసిన నగదు

ధాన్యం సేకరణలో నిబంధనలు

సుదీర్ఘ ప్రక్రియతో అన్నదాతలు అసహనం

» నెల రోజుల తరువాత డబ్బులు చెల్లింపు
» పౌరసరఫరాల సంస్థకు విక్రయించడానికి విముఖత
» ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు



కల్లంలో ధాన్యాన్ని గోనె సంచుల్లోకి నింపుతున్న రైతులు

మాకవరపాలెం, జనవరి 21: ధాన్యం సేకరణలో ప్రభుత్వం విధించిన పలు నిబంధనలు, డబ్బులు చెల్లింపుల్లో జాప్యం కారణంగా పౌరసరఫరాల సంస్థకు ధాన్యం విక్రయించడానికి రైతులు ముందూ వెనుకా ఆలోచిస్తున్నారు. మరోవైపు వరి పంట నూర్పిడి పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఈ కారణాల వల్ల ధాన్యం సేకరణ మందకొడిగా సాగుతున్నది.

పౌర సరఫరాల సంస్థ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరి కుప్పల నూర్పు పనులు మొదలుపెట్టారు. మాకవరపాలెం, గిడుతూరు, రాచపల్లి, పైడిపాల, కొండలఅగ్రహారం, మల్లవరం గ్రామాల్లో వారం రోజుల నుంచే నూర్పులు చేస్తున్నారు. కల్లంలో ధాన్యాన్ని ఆరబెట్టి, తేమ శాతం తగ్గిన తరువాత విక్రయించడానికి ఆర్బీకేల సిబ్బందిని సంప్రదిస్తున్నారు. అయితే ప్రభుత్వం పలురకాల నిబంధనలు విధించడంతోపాటు ధాన్యం విక్రయించిన నెల రోజుల తరువాత బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయని ఆర్బీకే సిబ్బంది చెబుతున్నారు. దీంతో రైతులు పెదవి విరుస్తున్నారు.

గతంలో వరి కుప్పలను నూర్చక ముందే ఈ-క్రాప్ నమోదు ప్రకారం ఏ రైస్ మిల్లుకు ధాన్యం తరలించాలో ముందుగానే రైతు పేరు మీద రశీదు వచ్చేది. రైతులు వరి పంటను నూర్చిన తరువాత నమూనాలను ఆర్బీకేలకు తీసుకెళ్లి చూపించేవారు. నిబంధనలకు అనుగుణంగా తేమ శాతం వుంటే కల్లం వద్దకు కాటాను, గోనె సంచులను తీసుకెళ్లి తూకం వేస్తారు. అనంతరం ట్రాక్టర్ లేదా లారీలో ధాన్యం బస్తాలను లోడింగ్ చేసి మిల్లుకు తరలిస్తారు. అయితే కొత్త నిబంధనల ప్రకారం ముందుగా ధాన్యం తరలించే వాహనం వివరాలను జీపీఎస్‌లో నమోదు చేసుకోవాలి. అనంతరం ఈ-క్రాప్ చేసుకున్న రైతు ముందుగా కొంత ధాన్యాన్ని పరీక్ష కోసం అందజేయాలి. అనంతరం వ్యవసాయ శాఖకు సంబంధించిన టెక్నికల్ సిబ్బంది ధాన్యం తరలించేందుకు అనుమతి ఇస్తారు. తరువాత ఖాళీ వాహనాన్ని తూకం వేయించి, ధాన్యం బస్తాలను లోడింగ్ చేస్తారు. మళ్లీ ట్రాక్టర్‌తో సహా ధాన్యం బస్తాలను తూకం వేస్తారు. అప్పుడు రైతు పేరు, విక్రయించిన ధాన్యం వివరాలను సాంకేతిక సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. తరువాత ధాన్యాన్ని ఏ మిల్లుకు తరలించాలో ఆన్‌లైన్‌లో వస్తుంది. అప్పుడు సంబంధిత రైస్ మిల్లుకు ధాన్యాన్ని పంపాలి. ఇంత సుదీర్ఘ ప్రక్రియ వుండడంతో పలువురు రైతులు ప్రైవేటు మిల్లర్లకు ధాన్యం విక్రయిస్తున్నారు. కాగా మండలంలో ఇంతవరకు సుమారు 130 టన్నుల ధాన్యం సేకరించినట్టు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అడుగడుగునా నిర్బంధం

అంగన్‌వాడీలు విజయవాడ వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

» నిరసన శిబిరాలు ముట్టడి
» పలువురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలింపు
» అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద 20 మంది అంగన్‌వాడీలు అడ్డగింత
» ఇరువర్గాల మధ్య వాగ్వాదం
» 'విజయవాడ వెళ్లనివ్వండి.. లేదా ఇళ్ల వద్ద వదిలిపెట్టండి' అని అంగన్‌వాడీలు పట్టు
» స్టేషన్ వద్దనే బైఠాయించి నిరసన
» ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
» నర్సీపట్నం ప్రాంత అంగన్‌వాడీలను తునిలో అడ్డుకుని స్టేషన్‌కు తరలింపు



అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు



పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో అంగన్‌వాడీలు

అనకాపల్లి టౌన్/నర్సీపట్నం/పాయకరావుపేట, జనవరి 21: విజయవాడలో నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావం తెలపడానికి, సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి నిరసన వ్యక్తం చేయడానికి విజయవాడ బయలుదేరుతున్న అంగన్‌వాడీలను జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకున్నారు. కొన్నిచోట్ల అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్లకు తరలించారు. పలువురు నేతలను గృహనిర్బంధం చేశారు. ఇళ్ల నుంచి బయటకు వస్తే అరెస్టు చేయాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు. దీంతో ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీలు మండిపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోగా, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

తమ సమస్యలు పరిష్కరించాలని, పాలకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు 41 రోజులుగా సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల జారీ చేసిన షోకాజ్ నోటీసులకు అంగన్‌వాడీలు ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందని ప్రభుత్వం.. తమను విధుల నుంచి తొలగించడానికి రంగం సిద్ధం చేసినట్టు తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. విజయవాడలో సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించాలన్న రాష్ట్ర కమిటీ పిలుపుతో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆదివారం సాయంత్రం విజయవాడ బయలుదేరారు. అయితే పోలీసులు పలుచోట్ల అంగన్‌వాడీలను అడ్డుకున్నారు. అనకాపల్లి పట్టణ పోలీసులు ఆదివారం సాయంత్రం నుంచే రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మోహరించారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో మునగపాక, రాంబిల్లి, అనకాపల్లి మండలాల నుంచి రైల్వే స్టేషన్‌కు వచ్చిన సుమారు 20 మంది అంగన్‌వాడీలు విజయవాడ వెళ్లకుండా అడ్డుకున్నారు. వారి వివరాలను నమోదు చేసుకుని, అక్కడి నుంచి కదలనివ్వలేదు. ఈ సందర్భంగా పోలీసులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. విజయవాడ వెళ్లడానికి అనుమతించాలని, లేదంటే తమకు ఇళ్ల వద్ద వదిలిపెట్టాలని, అంతవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. కాగా అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సుమారు పది మంది అంగన్‌వాడీలను పోలీసులు అదుపులోకి ... మిగతా 8వ పేజీలో



తుని పోలీసు స్టేషన్ ఆవరణలో నర్సీపట్నం నియోజకవర్గం అంగన్‌వాడీలు

పెన్సిల్ ముల్లుపై అయోధ్య రామమందిరం

» సూక్ష్మ కళాకారుడు గోపాల్ ప్రతిభ



పెన్సిల్ ముల్లుపై రూపొందించిన అయోధ్య రామమందిరం

మాడుగుల రూరల్, జనవరి 21: అయోధ్యలో బాల రాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠ మహోత్సవం, రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ సూక్ష్మ కళాకారుడు నైదండ గోపాల్ మరోసారి తన కళా ప్రతిభను చాటాడు. పెన్సిల్ ముల్లుపై అయోధ్య రామమందిరం నమూనాను చక్కగా చెక్కాడు. మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామానికి చెందిన గోపాల్ ప్రత్యేక సందర్భాల్లో చాక్‌పీస్‌లు, పెన్సిల్ ముల్లుతో సూక్ష్మ కళాఖండాలను తయారు చేస్తుంటాడు. సోమవారం అయోధ్యలో బాల రాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని పెన్సిల్ ముల్లుపై రామమందిరాన్ని అద్భుతంగా ఆవిష్కరించాడు. దీనిని రూపొందించడానికి రెండు గంటల సమయం పట్టిందని గోపాల్ చెప్పాడు.

'ప్రధాన మంత్రి పరీక్షా పే' చర్చకు చీడికాడ హైస్కూల్ విద్యార్థి



అనిల్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎంఈవో బి.వి.రమణ

చీడికాడ, జనవరి 21: ప్రధాన మంత్రి పరీక్షా పే చర్చ కార్యక్రమానికి చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కుంచ అనిల్‌కుమార్ ఎంపికయ్యాడు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో రెండు ఉన్నత పాఠశాలల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికకాగా వీరిలో చీడికాడ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వుండడం గర్వంగా వుందని ఎంఈవోలు కె.బొంజుబాబు, బి.వి.రమణ అన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌ను ఎంఈవోలు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పడకేసిన అభివృద్ధి

చెట్టుపల్లిలో అసంపూర్తిగా సచివాలయం, హెల్త్ సెంటర్, ఆర్‌బీకే భవనాలు

బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులను మధ్యలో ఆపేసిన కాంట్రాక్టర్లు

» పూర్తి చేసిన భవనాలు సైతం ప్రారంభానికి నోచుకోని వైనం
» జగనన్న కాలనీలో మందకొడిగా ఇళ్ల నిర్మాణం
» 127 మందికి ఇళ్ల స్థలాలు.. ఇంతవరకు 38 ఇళ్లు మాత్రమే పూర్తి
» ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు సరిపోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన



పిల్లర్ల స్థాయిలో ఆగిన పంచాయతీ కార్యాలయం భవనం మీద అదనపు అంతస్థు నిర్మాణం



పునాదుల స్థాయిలో నిలిచిన విలేజ్ క్లినిక్ భవనం

నర్సీపట్నం, జనవరి 21 : రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలకు నూతన భవనాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం కారణంగా నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో సచివాయం, విలేజ్ క్లీనిక్, రైతు భరోసా కేంద్రాల భవని నిర్మాణాలు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. జగన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి.

చెట్టుపల్లి గ్రామంలో 5,555 మంది జనాభా ఉన్నారు. రెండు వేల మంది జనాభాకు ఒకటి చొప్పున సచివాలయం, హెల్త్ సెంటర్లు, ఆర్‌బీకేలు రెండేసి చొప్పున మంజూరు అయ్యాయి. వీటిలో ఒక ఆర్‌బీకే. హెల్త్ సెంటర్, సచివాలయం భవన నిర్మాణాలు పూర్తి చేసినప్పటికీ ఇంకా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. పంచాయతీ కార్యాలయం మీద రూ.25 లక్షలతో సచివాలయం నిర్మాణం మొదలు పెట్టి మధ్యలో ఆపేశారు. ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లు నిర్మాణాలు కూడా అసంపూర్తిగా ఉన్నాయి. ఒక హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తి చేసినప్పటికీ భవనాన్ని వైద్య ఆరోగ్య శాఖకు ఇంకా అప్పగించలేదు. దీంతో గ్రామంలోని రెండు హెల్త్ సెంటర్లు అద్దె భవనాల్లో నిర్వహించాల్సి వస్తున్నది. డిజిటల్ లైబ్రరీ భవనం పునాదుల స్థాయిలోనే ఆగిపోయింది. డిజిటల్ లైబ్రరీ, బల్క్ మిల్క్ సెంటర్లను పూర్తిగా అటకెక్కించారు. ప్రాధాన్యత ప్రకారం సచివాయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్ల భవనాలను పూర్తి చేసిన తర్వాతే డిజిటల్ లైబ్రరీ, బల్క్ మిల్క్ సెంటర్ల భవనాలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు అధికారులు చెబుతున్నారు.



జనగన్న కాలనీలో అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు

మందకొడిగా జగనన్న కాలనీ నిర్మాణాలు

ఇళ్లు లేని నిరుపేదల కోసం జగనన్న కాలనీలో 127 మందికి స్థలాలు మంజూరు చేశారు. వారిలో 38 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. పునాదుల స్థాయిలో 75, గోడల వరకు 8, శ్లాబ్ స్థాయిలో 6 ఇళ్లు ఉన్నాయి. రెండేళ్ల క్రితమే స్థలాలు ఇచ్చినప్పటికీ భవన నిర్మాణ సామగ్రి ధరలు, కూలీల రేట్లు పెరిగి పోయి, ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు సరిపోక అప్పులు చేయాల్సి వస్తున్నదని లబ్ధిదారులు వాపోతున్నారు. మొత్తం మీద 127 మందికిగాను 38 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ. పక్కన తోట నగేశ్, తదితర నేతలు

రాష్ట్రంలో పోలీస్ రాజ్యం

ప్రస్తుత పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి

» ఎడాపెడా అప్పులతో రాష్ట్రం దివాలా
» ఏపీని కాపాడుకోవడానికి మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చాను
» మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ
» జనసేన పార్టీలో చేరనున్నట్టు వెల్లడి

రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తున్నదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం అనకాపల్లి జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో తన అనుచరులు, అభిమానులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకే తిరిగి క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. పాలకుల తప్పులను ఎత్తిచూపేవారిని, ప్రశ్నించే వారిని అణచివేయడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యంగా మారిందన్నారు. గత నాలుగున్నరేళ్లలో కొత్తగా ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా అందుబాటులోకి రాలేదని అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలన్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని జగన్ అడ్డుకోలేకపోతున్నారని విమర్శించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పట్టుదలతో అనుకున్నది సాధించే వ్యక్తి అని, అందుకే ఆయనతో కలిసి పనిచేయడానికి ఆ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నానని కొణతాల రామకృష్ణ చెప్పారు.

-వివరాలు మెయిన్ ఎడిషన్‌లో

సిలబస్ పూర్తికాకుండానే ఫార్మేటివ్ పరీక్షలా?

» వరుస సెలవులతో తరగతుల నిర్వహణకు అవాంతరాలు
» అయినా పట్టించుకోని పాఠశాల విద్యా శాఖ
» పరీక్షలపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన

- 7లో

పుంజుకున్న పర్యాటకం

పెరిగిన సందర్శకులు



బీచ్‌రోడ్డులోని కురుసుర మ్యూజియం వద్ద క్యూలైన్లో వేచి ఉన్న పర్యాటకులు

» ఉమ్మడి విశాఖ జిల్లాకు 2023లో 1.71 కోట్ల మంది రాక
» సగటున రోజుకు 47 వేల మంది రాక

2023లో నెలల వారీగా పర్యాటకుల లెక్క

నెల	దేశీయ పర్యాటకులు	విదేశీ పర్యాటకులు
జనవరి	15,24,303	2,416
ఫిబ్రవరి	12,47,028	3,665
మార్చి	12,92,904	3,881
ఏప్రిల్	13,97,610	3,141
మే	14,62,051	3,158
జూన్	14,55,946	2,476
జూలై	15,61,177	3,157
ఆగస్టు	13,57,313	2,553
సెప్టెంబరు	12,40,029	2,484
అక్టోబరు	16,33,198	3,551
నవంబరు	14,31,131	4,370
డిసెంబరు	15,62,745	5,697

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటకం కొత్త పుంతలు తొక్కుతోంది. కరోనా కారణంగా రెండేళ్లు పడకేసిన ఈ రంగం 2023లో ఊహించని విధంగా పుంజుకుంది. గత జనవరి నుంచి డిసెంబరు వరకు పన్నెండు నెలల్లో 1,71,78,184 మంది పర్యాటకులు ఉమ్మడి జిల్లాను సందర్శించారు. అంటే రోజుకు సగటున 47 వేల మంది చొప్పున నెలకు సుమారుగా 15 లక్షల మంది విచ్చేశారు. విదేశీ ప్రయాణికుల సంఖ్య 40,749గా నమోదైంది. కరోనాకు ముందు సింగపూర్, దుబాయ్, మలేషియా, శ్రీలంక దేశాలకు విశాఖ నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు ఉండేవి. కరోనా తరువాత సింగపూర్ సర్వీసును మాత్రమే పునరుద్ధరించారు.మిగిలిన మూడు సర్వీసులు నిలిచిపోయాయి. అయినాసరే విదేశీ పర్యాటకుల సంఖ్య బాగా పెరిగింది.

ఆకర్షిస్తున్న కొత్త ప్రాంతాలు

కరోనా తరువాత చాలామంది వ్యక్తిగత జీవితానికి కొంత సమయం కేటాయిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

» మృతుడు కాకినాడ వాసి


ఉదయ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం రూరల్, జనవరి 21: మండలంలోని ఆవసోమవరం శివారు పిల్లోడు పాలెం సమీపంలో గల చెరువు గట్టు వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కాకినాడ జగన్నాథపురంలోని రిక్షా వీధికి చెందిన కాకి ఉదయ్‌కుమార్(20) రెండు రోజుల క్రితం చోడపల్లిలోని తన చెల్లి, బావ ఇంటికి వచ్చాడు. అక్కడ ఆనందంగా గడిపి ఆదివారం ఉదయం సమీపంలోని పిల్లోడిపాలెంలో గల బంధువుల ఇంటికి వెళుతున్నానని చెప్పి బయలుదేరాడు. అయితే అక్కడికి సమీపంలోని చెరువు వద్ద తన ద్విచక్ర వాహనాన్ని ఆపి అక్కడే ఉన్న చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి వచ్చి మృతుని జేబులో ఉన్న అడ్రస్ కాగితం ఆధారంగా అతని వివరాలు తెలుసుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. అతను ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు.

ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ

» యువకుడి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


కొనగాన రవితేజ (ఫైల్ ఫొటో)

కొయ్యూరు/ కృష్ణాదేవిపేట, జనవరి 21: నర్సీపట్నం- కృష్ణాదేవిపేట ప్రధాన రహదారిపై కొయ్యూరు మండలం కొండగోకిరి గ్రామశివారులో శనివారం అర్ధరాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి మంప ఎస్ఐ లోకేశ్‌కుమార్ వెల్లడించిన వివరాలి వున్నాయి. గొలుగొండ మండలం కొంగసింగి గ్రామానికి చెందిన కొలగాన రవితేజ(22) శనివారం కృష్ణాదేవిపేటలో జరిగిన రాములవారి తీర్థానికి వచ్చాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇదే మండలం చోద్యం గ్రామానికి చెందిన తన స్నేహితుడిని బైక్‌పై ఎక్కించుకుని అతని ఇంటిదగ్గర దించేసి తిరిగి కృష్ణాదేవిపేట వస్తున్నాడు. ఇదే సమయంలో గొలుగొండకు చెందిన సప్పా సూర్యకుమార్, సోమవరపు మధు కృష్ణాదేవిపేట నుంచి సొంతూరుకు బైక్‌పై వెళుతున్నారు. కొండగోకిరి సమీపంలో మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో కొలగాన రవితేజ తీవ్రంగా గాయపడి అక్కడక్కడే మృతి చెందాడు. సూర్యకుమార్ తలకు తీవ్రగాయంకాగా కాలు, చెయ్యి విరిగిపోయాయి. బైక్‌పై వెనుకకూర్చున్న మధు తలకు తీవ్ర గాయం అయ్యింది. సమాచారం అందుకున్న కృష్ణాదేవిపేట పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. కాగా రవితేజ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సీపట్నం తరలించారు.

లక్కవరం హైవేపై ఢీకొన్న మూడు లారీలు



వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న కంటైనర్, వెనుకనే ఢీకొన్న మరో లారీ

» ఇద్దరికి గాయాలు

ఎలమంచిలి, జనవరి 21: మండలంలోని లక్కవరం జంక్షన్ జాతీయ రహదారిపై ఆదివారం ఆగి ఉన్న వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొంది. ఆ వెనుకనే వస్తున్న మరో లారీ కూడా వాటిని ఢీకొనడంతో లారీ సిబ్బంది ఇద్దరికి గాయాల య్యాయి. క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. లక్కవరం జంక్షన్ వద్ద హైవేపై డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు ట్యాంకర్ లారీ ద్వారా నీరు పెడుతుండగా అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లే కంటైనర్ ఆ వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో కంటైనర్‌ను వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టడంతో ఇద్దరు సిబ్బందికి గాయాలయ్యాయి. అయితే దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని, ఇంకా కేసు నమోదు చేయలేదని ఇన్‌చార్జి ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

పరవాడ, జనవరి 21: మండలంలోని జి.మత్రిపాలెం శివారులో ఆదివారం కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ తేజేశ్వరరావు సిబ్బందితో అక్కడికి వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు వేల రూపాయల నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. పందేలు ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు.

30 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, జనవరి 21: స్థానిక సింహాద్రి జంక్షన్‌లో ఒక పాన్‌షాప్‌లో మద్యం అమ్మకాలు సాగిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం ఎస్ఐ జి.తేజేశ్వరరావు తన సిబ్బందితో వెళ్లి సోదాలు నిర్వహించారు. 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అమ్మకాలు సాగిస్తున్న యజమాని గొర్లి రామారావును అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ తేజేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

» లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు

ఎలమంచిలి, జనవరి 21: ఎలమంచిలి యర్రవరం సమీపంలోని జాతీయ రహదారిపై లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి తుని నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు కావడంతో వారిని ఎలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిద్దరూ అపస్మారక స్థితిలో ఉండడంతో పూర్తి వివరాలు తెలియలేదు.

మామిడిపల్లిలో సబ్‌స్టేషన్‌కు ప్రతిపాదనలు

» ఈపీడీసీఎల్ ఎస్ఈ.మహేంద్రనాథ్

దేవరాపల్లి, జనవరి 21: చీడికాడ మండలం తరహాలో దేవరాపల్లి మండలం మామిడిపల్లిలో 132/33 కేవీ సబ్‌స్టేషన్‌కు రూ.పది కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్టు ఈపీడీసీఎల్ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. తారువలో సబ్‌స్టేషన్ ప్రారంభానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ విద్యుత్ కేంద్రానికి అవసరమైన నాలుగు ఎకరాల స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. చింతలపూడిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈస్టన్ పవర్ యాప్‌లో బిల్లులు చెల్లిస్తే బిల్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అలాగే 1912కి ఫోన్ చేయడం వలన ప్రతి సమస్య నమోదై.. తరచూ వచ్చే సమస్యలకు కారణాలు తెలుస్తున్నాయన్నారు. తారువ సబ్‌స్టేషన్ ద్వారా ఎం.అమండకు విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఎంపీటీసీ సభ్యుడు పోతల వెంకటరమణ కోరిన విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఆయన వెంట ఈఈలు వీడీవీ రామకృష్ణ, చెల్లిబాబు, రాజకుమార్, వెంకటేశ్వరరావు, గౌరీప్రసాదు, ఏఈఈ కర్రి శంకరరావు ఉన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

అపారిశుధ్య గొల్లగుంట

పరవాడ, జనవరి 21: మండలంలోని రావాడ పంచాయతీ పరిధి గొల్లగుంట గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఇక్కడ మౌలిక వసతులను కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు 300 మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో డ్రైనేజీలను నిర్మించలేదు. దీని వల్ల ఇళ్లల్లోని వాడుక నీరంతా ప్రధాన రహదారి పైనే పారుతోంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెంది కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. మంచినీటి బోరు వద్ద అపారిశుధ్యం తాండవిస్తున్నది. బోరు, పరిసర ప్రాంతమంతా మురుగునీటితో నిండిపోయింది. దీంతో నీరు పట్టుకోవడానికి స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలోనే పాలకులు గ్రామానికి వస్తారని, మిగతా రోజుల్లో ఒక్కరూ తమ గ్రామం వైపు కన్నెత్తి చూడరని చెబుతున్నారు. గ్రామంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.


డ్రైనేజీ లేకపోవడంతో రోడ్డుపై పారుతున్న మురుగునీరు


మంచినీటి బోరు వద్ద ఇలా..

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు



మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, జనవరి 21: వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. ఆదివారం టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆదాయం పెరగలేదని, యువతకు ఉద్యోగాలు రాలేదని ఆరోపించారు. ప్రజలపై పన్నుల భారం మాత్రం మరింత పెరిగిందన్నారు. ఎన్నికలకు ముందు మద్యనిషేధాన్ని దశల వారీగా అమలు చేస్తామని మహిళలకు హామీలిచ్చి దానిని తుంగలోకి తొక్కారన్నారు. పైగా నాసిరకం మద్యం బ్రాండ్‌లను సరఫరా చేసి సాధారణ, మధ్యతరగతి కుటుంబాలను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి పేదల భూములను దోచుకునేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే భూ రక్షణ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. జగన్‌రెడ్డిని సాగనంపేందుకు మరో 80 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, విల్లూరి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

సిలబస్ పూర్తికాకుండానే ఫార్మేటివ్ పరీక్షలా?

» వరుస సెలవులతో తరగతుల నిర్వహణకు అవాంతరాలు
» అయినా పట్టించుకోని పాఠశాల విద్యా శాఖ
» పరీక్షలపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఈనెల 23 నుంచి ఫార్మేటివ్-3 పరీక్షలు నిర్వహించాలని షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఈ పరీక్షలకు సంబంధించిన సిలబస్ ఇంకా పూర్తికాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల్లో బోధనకు ఎస్‌సీఆర్‌టీ ప్రణాళిక రూపొందిస్తోంది. దీని ప్రకా రం ఏటా నిర్వహించే సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షలకు సంబం ధించి షెడ్యూల్ ఖరారు చేస్తారు. ప్రతి పాఠ్యాంశంలో నిర్ణీత చాప్టర్లను విద్యార్థులకు బోధించిన తరువాత పరీక్షలు నిర్వహిస్తారు. తొలుత రెండు ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహించిన తరువాత దసరా సెలవులకు ముందు లేదా తరువాత సమ్మేటివ్ పరీక్షలు, సంక్రాంతి సెలవులకు ముందు, లేదా తరువాత ఫార్మేటివ్, ఫిబ్రవరిలో సమ్మేటివ్ పరీక్షలు ఉంటాయి. సిలబస్ పూర్తియిన తరువాత వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు.

గత ఏడాది నవంబరు రెండోవారంలో సమ్మేటివ్-1 పరీక్షలు నిర్వహించారు. పలు కారణాలతో వారం రోజుల్లో ముగియాల్సిన ఈ పరీక్షలు రెండు వారాలకుపైగా సాగాయి. తరువాత తరగతుల నిర్వహణకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. తుఫాన్ కారణంగా సెలవులు, క్రిస్మస్, సంక్రాంతి సెలవులు, మధ్యలో ఆడుదాం ఆంధ్రా పేరుతో ఉన్నత పాఠశాలల్లో హడావిడి చేశారు. ఉన్నత పాఠశాలల మైదానాల్లో పోటీల నిర్వహణ, విద్యార్థులపై ఒత్తిడి తెచ్చి ఆటలాడించడం జరిగాయి. పైగా ఈ పోటీలు వచ్చేనెల వరకు కొనసాగనున్నాయి. దీంతో విద్యార్థులు ఆటలపై ఫోకస్ పెట్టారు. మొత్తంగా ఫార్మేటివ్-3కు సంబంధించిన సిలబస్ ఇంకా పూర్తికాలేదని ఉపాధ్యాయులే అంగీకరిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల వరకు పెద్దగా ఇబ్బందిలేకపోయినా ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షలకు సన్నద్ధం కాలేదు. ఇక ప్రైవేటు పాఠశాలల విషయానికి వస్తే విద్యా సంవత్సరం మొదలైన మూడు నెలల్లోనే మొత్తం సిలబస్ బోధించేస్తారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో షెడ్యూల్ మేరకు బోధన సాగుతుంది. దీంతో ఫార్మేటివ్3 పరీక్షలు ఎలా రాస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యపై దృష్టిసారించకుండా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించడాన్ని తల్లిదండ్రులు తప్పుబడుతున్నారు.

వైభవంగా శ్రీరామ రథయాత్ర

» సాగరతీరానికి భారీగా తరలివచ్చిన భక్తులు



విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో శ్రీరామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సాగర తీరంలోని ఆర్కే బీచ్ కాళీమాత గుడి నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు ఆదివారం శ్రీరామ రథయాత్రను నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ సాగినయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని.. జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. కోలాటం, భజనలు, కేరళ వాయిద్య బృందాల మధ్య వైభవంగా యాత్ర సాగింది. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆధ్వర్యంలో జరిగిన రథయాత్రలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేన నేతలు కోన తాతారావు, పీవీఎస్ఎన్ రాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


బీచ్ రోడ్డులో శ్రీరామ శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) సీతారాముల విగ్రహాలు

రైళ్లకు తగ్గని సంక్రాంతి ప్రయాణికుల తాకిడి

» తిరుగు ప్రయాణంలో అవస్థలు
» రిజర్వేషన్ కోచ్‌ల్లోనూ రద్దీ

విశాఖపట్నం, జనవరి 21: సంక్రాంతి తిరుగు ప్రయాణికులపై రైళ్ల రద్దు ప్రభావం తీవ్రంగా చూపుతోంది. రైళ్లన్నీ జనాలతో కిక్కిరిసినడుస్తున్నాయి. పండుగ ముగించుకుని గమ్యాలకు చేరేందుకు ఆదివారం స్టేషన్‌కు చేరుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్లాట్‌ఫామ్‌లన్నీ జనాలతో కిటకిటలాడాయి. ఏ రైలులో కూడా లోపలికి ప్రవేశించే అవకాశం లేకపోవడంతో ది క్కుతోచని పరిస్థితి ఎదుర్కొన్నారు. పిల్లాపాపలతో స్టేషన్‌కు చేరిన కొందరు రద్దీకి భయపడి ప్ర యాణాన్ని వాయిదా వేసుకుని తిరిగి ఇంటి ముఖం పట్టారు. మరికొందరు మరో రైలు కోసం ని రీక్షిస్తూ కనిపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు రద్దీని ఎదుర్కొని గమ్యాలకు చేరేందుకు ప్రయత్నించారు. విశాఖనుంచి ఉత్తరాంధ్ర ప్రాంతాలతోపాటు భువనేశ్వర్, రాయగడ, రాయపూ ర్, కోరాపుట్ ప్రాంతాలకు వెళ్లే రైళ్లతోపాటు రాజమండ్రి, విజయవాడ, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలకు బయలుదేరే అన్ని రైళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రిజర్వేషన్ కోచ్‌లు కూడా సాధారణ కోచ్‌లు తలపించే విధంగా కిక్కిరిసి నడవడం గమనార్హం.


రైళ్ల రద్దు ప్రభావం

రైళ్ల రద్దు ప్రభావం.. ఆదివారం పండుగ తిరుగు ప్రయాణికులపై స్పష్టంగా కనిపించింది. వాల్తేరు డివిజన్ పరిధిలోని సింగపూర్ రోడ్డు, రాయగడ స్టేషన్ల మధ్య మూడో లైను నాన్ ఇం టర్ లాకింగ్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ-రాయపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ రైళ్లు (08528/08527), విశాఖ- భవానీపట్న- విశాఖ ప్రత్యేక రైళ్లు (08504/08503), విశాఖ-కోరాపుట్-విశాఖ ప్రత్యేక పాసింజర్ రైళ్లు (08546/08545), విశాఖ-కోరాపుట్-విశాఖ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు (08512/08511)తోపాటు తిరుపతి- బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (174 82/17481) రైళ్లను రద్దు చేయడంతో ఆ ప్రభావం ఉత్తరాంధ్రతోపాటు ఒడిశాలోని తెలుగు ప్రజ లు నివసించే ప్రాంతాలపై చూపింది.

ఇక, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ సెక్షన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్నందున విశాఖ, గుంటూరు మధ్య నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు (17239/17240), విశాఖ - విజయవాడ/గుంటూరు-విశాఖ మధ్య నడిచే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు (22701/ 22702) రద్దుతో కోస్తాంధ్రలోని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, గుంటూరు జి ల్లాకు వెళ్లే ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. ఆదివారం ఉదయం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805)తోపాటు మధ్యాహ్నం బయలుదేరే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488)లకు తీవ్ర రద్దీ నెలకొంది. ఇక, సోమవారం తప్పనిసరిగా విద్య, వ్యాపార, ఉద్యోగాల్లో చే రాల్సిన వారు సికింద్రాబాద్ తదితర ప్రాంతాలకు బయలుదేరడంతో విశాఖ నుంచి వెళ్లే.. గో దావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12861), దురంతో (22203), గరీబ్‌రథ్(12739), విశాఖ-సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12783), ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519) వంటి ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), సంబల్‌పూర్-నాందేడు (20 809), కో ణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703) రైళ్లు రద్దీగా నడిచాయి. రిజర్వేషన్ బోగీలు జనరల్ కోచ్‌లను తలపించేలా కిటకిటలాడాయి.

ఓట్ ఫర్ ఓపీఎస్ సభను విజయవంతం చేద్దాం

» యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చినబ్బాయి


ఓట్ ఫర్ ఓపీఎస్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 21: పాత పెన్షన్ పథకం సాధన కోసం ఈ నెల 28న రాజమండ్రిలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల మైదానంలో జరగనున్న ఓట్ ఫర్ ఓపీఎస్ సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి కోరారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద పోస్టర్‌ను యూటీఎఫ్ జిల్లా నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా చినబ్బాయి మాట్లాడుతూ పాత పెన్షన్ పథకం కావాలని కోరుతూ రాజమండ్రిలో జరగనున్న బహిరంగ సభకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. సీపీఎస్‌ను రద్దు చేయమని ఉద్యోగ, ఉపాధ్యాయులు జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కోరితే ముఖ్యమంత్రి అయిన తరువాత సీపీఎస్‌ను రద్దు చేసి ఎవరు కోరుకోని జీపీఎస్ పథకాన్ని ప్రవేశపెట్టడం మోసపూరిత చర్య అని విమర్శించారు. అందు వల్ల పాత పెన్షన్ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చే పార్టీకి మాత్రమే ఓటు వేయాలనే నినాదంతో రాజమండ్రిలో ఈ బహిరంగసభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆ రోజు జరిగే సభకు అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. పెన్షన్ అనేది సామాజిక భద్రతకు చెందిన విషయమని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఓపీఎస్‌ను అమలు చేస్తామని తీర్మానించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్యదర్శులు నడిగట్ల శేషకుమార్, పొలిమేర చంద్రరావు, రాష్ట్ర కౌన్సిలర్లు యల్లయ్యబాబు, మారిశెట్టి వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

భారీ రక్తదాన శిబిరం రేపు

» టీడీపీ యువ నాయకుడు రత్నాకర్


మాట్లాడుతున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, జనవరి 21: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా ఈనెల 23వ తేదీన స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతుభారతి హాల్‌లో రక్తదాన శిబిరం, ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్టు టీడీపీ యువ నాయకుడు దాడి రత్నాకర్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. శంకర్ ఫౌండేషన్, రాజా ఆప్టికల్స్ సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు కూడా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రత్నాకర్ కోరారు.

తులసీ ఘాట్‌లో తులసీరావు విగ్రహం ఏర్పాటు


తులసీరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, జనవరి 21 : విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు ఘాట్ వద్ద ఆదివారం ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, చైర్‌పర్సన్ రమాకుమారి, తులసీరావు కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. ఫిబ్రవరి 1వ తేదీన తులసీరావు జన్మదినం పురస్కరించుకుని ఆయన విగ్రహావిష్కరణ చేపట్టి అదే రోజు తీర్థాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఎండీ వెంకటరమణ, డెయిరీ డైరెక్టర్లు రమణబాబు, చిటికెల వెంకటరమణ, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, ఆడారి వెంకట్, మళ్ల కొండబాబు, కౌన్సిలర్లు, ఆనంద్ అభిమానులు పాల్గొన్నారు.

గర్భిణికి తప్పని డోలీ మోత

» రహదారి సౌకర్యం లేక 8 కిలో మీటర్లు మోసుకెళ్లాల్సిన దుస్థితి


గర్భిణిని రాచకిల్లం నుంచి డోలీలో మోసుకెళుతున్న దృశ్యం

అరకులోయ, జనవరి 21: అనంతగిరి మండలం పినకోట పంచాయతీ రాచకిల్లం గ్రామానికి చెందిన నిండు గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు డోలీలో ఎనిమిది కిలో మీటర్ల మేర మోసుకెళ్లి ఆస్పత్రికి తరలించిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రాచకిల్లం కొండ శిఖర గ్రామానికి చెందిన సూకూరు చిన్నలమ్మ నిండు గర్భిణి కావడంతో ఆదివారం ఉదయం పురిటి నొప్పులు వచ్చాయి. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు డోలీ కట్టి ఆమెను 8 కిలో మీటర్ల వరకు మోసుకుంటూ వెళ్లి బల్లగరువు గ్రామానికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో పినకోట ఆస్పత్రికి తరలించారు. ఈ వారం రోజుల్లో ఇదే విధంగా ముగ్గురు గర్భిణులను మోసుకువెళ్లాల్సి వచ్చిందని గ్రామస్థుడు సూకూరు జన్మరాజు, సీపీఎం నాయకుడు గోవిందరావు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బల్లగరువు నుంచి రాచకిల్లం గ్రామం వరకు నిలిచిపోయిన రహదారి పనులు పూర్తి చేస్తే రాజకిల్లం పరిసర ప్రాంతంలో ఉండే 11 గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పడుతుందని వారు చెప్పారు.

విశాఖలో వైసీపీ నాయకుల భూ దోపిడీ

» రామానాయుడు స్టూడియో భూముల స్వాహాకు యత్నం
» అందులో భాగంగానే వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌లో మార్పులు
» టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు పల్లా

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌రోడ్‌లో రామానాయుడు స్టూడియోకు కేటా యించిన 34.44 ఎకరాల భూముల దోపిడీకి అధికార పార్టీ పెద్దలు వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌ను మార్పు చేశారని టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం ఆయన నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖలో సినీ పరిశ్రమ విస్తరణ కోసం 2003లోఅప్పటి సీఎం చంద్రబాబునాయుడు 34.44 ఎకరాలు రామానాయుడుకు కేటాయించారని గుర్తుచేశారు. అయితే ఇక్కడి విలువైన భూములను బెదిరించి దోచుకున్న వైసీపీలోని కీలక వ్యక్తులు, స్టూడియో ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాల లేఅవుట్‌కు జీవీఎంసీ అనుమతి ఇచ్చిందన్నారు. దీనిపై తమ పార్టీకి చెందిన తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సుప్రీంకోర్టులో కేసు వేశారని చెప్పారు. స్టూడియోను రిక్రియేషన్ కోసం తప్ప ఇతరత్రా అవసరాలకు వినియోగించరాదని కోర్టు స్టే ఇచ్చి మొట్టి కాయలు వేసిందన్నారు. నగరంలో విలువైన భూములు దోచుకున్న వైసీపీ నాయకులు, వారితో పాటు తమ అనుయాయులకు చెందిన భూములకు ప్రయోజనం కలిగేలా వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌ను ఇష్టానుసారం మార్చేశారని ఆరోపించారు. గాజువాకలో పాత గాజువాక జంక్షన్ నుంచి టోలుగేటు వరకు మాస్టర్‌ప్లాన్ మార్పులు చేసి రోడ్‌కు అవసరమైన భూసేకరణలో అస్మదీయులకు టీడీఆర్‌లు జారీకి ప్రయత్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. సిరిపురం నుంచి ఆశీలమెట్ట వరకు రోడ్ విస్తరణకు అనువుగా మాస్టర్ ప్లాన్ మార్చడంతో సీబీసీఎన్‌సీకి భారీ లబ్ధి చేకూర్చారన్నారు.

జగన్ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం

» తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత


టీడీపీ మండల స్థాయి బీసీ సభలో మాట్లాడుతున్న అనిత

నక్కపల్లి, జనవరి 21: సీఎం జగన్ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, కనీసం చేతివృత్తులపై ఆధారపడ్డ బీసీలకు కూడా ఎటువంటి ప్రోత్సాహకాలను ఈ ప్రభుత్వం అందించలేదని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. మండలంలోని దేవవరం గ్రామంలో ఆదివారం సాయంత్రం మండల స్థాయిలో టీడీపీ బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ టీడీపీ ఏర్పాటైనప్పటి నుంచి పార్టీకి బీసీలే వెన్నుముకగా నిలిచారని, బీసీల సంక్షేమానికి పెద్ద పీట వేసిన ఘనత ఎన్‌టీఆర్, చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మేకలు, గొర్రెల పెంపకందారుల సంక్షేమాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. మరో మూడు నెలల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, బీసీలకు చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలో బీసీలంతా టీడీపీకి ఎంతో వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. అనంతరం అనితను బీసీ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు వెంకటేశ్, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు,టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, గోసల తాతారావు, లాలం కాశీనాయుడు, ఉపమాక దేవస్థానం మాజీ ఛైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, బీసీ నేతలు గరికిన సింహాద్రి,కనకారావు పాల్గొన్నారు.

బీసీలకు టీడీపీ పెద్ద పీట : బండారు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

పరవాడ, జనవరి 21 : టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు పెద్దపీట వేసిందని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం పరవాడ మరిడిమాంబ కల్యాణ మండపంలో నిర్వహించిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. బీసీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అధికారంలోకి రావడం ఖాయమని, బీసీలకు తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ సదస్సులో మాజీ ఎంపీపీలు మాసవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాథరావు, టీడీపీ నాయకులు అట్టా సన్యాసి అప్పారావు, వియ్యపు చిన్న, బొండా తాతారావు, నగిరెడ్డి చిన్నారావు, గొర్లి శ్రీనివాస్, బంధం వెంకటరమణ, బొండా సన్నిదేముడు, పైలా రామచంద్రరావు, కేఆర్‌కే రాజు, పైలా చిన అక్కునాయుడు, పైలా కృష్ణ, పైలా రథాల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

41వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



అనకాపల్లి శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి టౌన్, జనవరి 21 : అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారానికి 41వ రోజుకి చేరుకుంది. నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద శిబిరంలో అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పరవాడలో.. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారానికి 41వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. అంగన్‌వాడీల సమ్మె ఆదివారానికి 41 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గోకాడ దేముడునాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళులు


వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీపీఎం నేత కె. లోకనాథం

అనకాపల్లి టౌన్, జనవరి 21 : స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రథమ సోషలిస్టు వి.ఐ. లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. లెనిన్ చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్సిజాన్ని మానవాళి విముక్తి కోసం ఉపయోగించిన మహోపాధ్యాయుడు లెనిన్ అని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్. శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు లెనిన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

తుమ్మపాలలో.. సమ సమాజ స్థాపన వ్యవస్థను ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి లెనిన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో జరిగిన లెనిన్ శత వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు, తాకాశి వెంకటేశ్వరరావు, బుద్ద వీరభద్రరావు, పెంటకోట నూకప్రసాద్, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, నేతలు నారాయణరావు, రాంబాబు, రామకృష్ణ, శివాజీ, శ్రీనివాసర్, లక్ష్మీనారాయణ, ధనరాజు గంగాధర్‌రావు తదితరులు ఉన్నారు.

కొండకర్ల ఆవ వద్ద పూర్వ విద్యార్థుల కలయిక


కొండకర్ల ఆవ వద్ద కుటుంబాలతో ఆనందిస్తున్న పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం రూరల్, జనవరి 21 : మండలంలోని హరిపాలెం హైస్కూల్‌లో 1993-94వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కొండకర్ల ఆవ వద్ద కలుసుకున్నారు. కుటుంబ సమేతంగా హాజరైన రోజంతా సంతోషంగా గడిపారు. ఆటపాటలతో ఆనందిస్తూ తరగతి గదిలో విశేషాలను నెమరు వేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కుటుంబాలతో ఆవలో బోటు షికారు చేశారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల భాస్కరరావు, శరగడం మోహన్‌రావు, పేలూరి నాయుడు, అంగుకూరి శ్రీను, గణేష్, కోటి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


1984-85 బ్యాచ్ పూర్వపు విద్యార్థుల గ్రూప్ ఫొటో

కొత్తూరు, జనవరి 21 : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం ఆలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. ఎంహెచ్ స్కూలులో 1984-85 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులంతా ఒకేచోట కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ములుకూరి రామకృష్ణ, అప్పికొండ మహేష్, చెరుకూరి సుబ్బారావు, బొట్టా చిన్నియాదవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి రాష్ట్ర యూనియన్ వితరణ

అచ్యుతాపురం రూరల్, జనవరి 21 : ఇటీవల మృతి చెందిన చీమలాపల్లికి చెందిన ఆటోడ్రైవర్ ఆడాడ బాబ్జీ కుటుంబానికి ఏపీ టాటా మేజిక్ యూనియన్ పెద్దాపురం స్టాండ్ సభ్యులు 74వేల111 రూపాయల నగదును ఆదివారం అందజేశారు.అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మోగిలి యేసు, కూండ్రపు వీరబాబు, సువ్వారి మోహన్, బోదెపు శ్రీను, జోగా మహాలక్ష్మీనాయుడు, మణి పాల్గొన్నారు.

అడుగడుగునా నిర్బంధం

... 5వ పేజీ తరువాయి

తీసుకున్నారు. పోలీసుల తీరును సీఐటీయూ నాయకులు ఖండించారు.

పాయకరావుపేటలో ముందస్తు అరెస్టులు

నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం విజయవాడలో జరిగే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వెళుతున్నట్టు సమాచారం రావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు పాయకరావుపేట పోలీసులు ముందస్తు కట్టడి చర్యలకు దిగారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తను ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. సమస్యల పరిష్కారం కోరుతూ 41 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు పాయకరావుపేట తహసీల్దారు కార్యాలయం ఎదుట శిబిరం ఏర్పాటు చేసిన నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి పలువురు అంగన్‌వాడీలు విజయవాడ బయలుదేరుతున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో నిరసన శిబిరం వద్దకు వచ్చారు. అంగన్‌వాడీ వర్కర్లు కె.నూకరత్నం, పి.సత్యవేణి, కె.కుమారి, ఎం.నూకరత్నం, ఎన్.సత్యవతిలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


విజయవాడ వెళ్లడానికి అనుమతించండి.. లేదంటే ఇళ్ల వద్ద వదిలిపెట్టాలంటూ అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద ధర్నాచేస్తున్న అంగన్‌వాడీలు

తుని పోలీస్ స్టేషన్‌కు 'పట్నం అంగన్‌వాడీలు

నర్సీపట్నం, జనవరి 21: విజయవాడలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావం తెలపడానికి అనకాపల్లి జిల్లా నుంచి బయలుదేరిన పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను తునిలో పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకోవడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు అన్నారు. అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ పోలీసులు నిర్బంధించడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి, అంగన్‌వాడీల డిమాండ్లను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని ఆయన కోరారు. కాగా నర్సీపట్నం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవాడ వెళ్లడానికి ఆదివారం సాయంత్రం తుని రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు... అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.


పాయకరావుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్న అంగన్‌వాడీలు

పుంజుకున్న పర్యాటకం

... 5వ పేజీ తరువాయి

పర్యటనలకు వెళ్లడం ప్రారంభించారు. ఇదే సమయాన అల్లూరి సీతారామరాజు జిల్లాలో శీతాకాలం ఎక్కడికక్కడ అందమైన మేఘాలు ఆవిష్కృతం కావడం, అవి సోషల్ మీడియా ద్వారా జనబాహుళ్యం దృష్టికి వెళ్లడంతో 'ఛలో ఏజెన్సీ' అంటూ అంతా వాహనాల్లో బయలుదేరిపోతున్నారు. గతంలో చింతపల్లి మండలం లంబసింగిలో మాత్రమే మేఘాల లోకం ఆవిష్కృతమయ్యేది. ఆ తరువాత పాడేరు సమీపాన వంజంగి, అరకులోయ వద్ద మాడగడ సందర్శనీయ ప్రాంతాలుగా మారాయి. ఇంకా మరికొన్ని ప్రాంతాలు కూడా అందుబాటులోకి రావడంతో సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది.

వంజంగిలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్

శీతాకాలంలో అక్టోబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఏజెన్సీకి సందర్శకులు పెద్ద సంఖ్యలో రావడం ఆనవాయితీ. ఈసారి డిసెంబరులో ఎక్కువ మంది రావడంతో సందర్శనీయ ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. రోజూ వేల సంఖ్యలు పర్యాటకులు రావడం, అందుకు తగ్గట్టుగా పారిశుధ్య పనులు అక్కడ చేపట్టలేకపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వంజంగిలో సందర్శకులకు వారం రోజులు అనుమతించబోమని ఐటీడీఏ ప్రకటించింది. జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు ఎవరినీ అక్కడికి రానీయకుండా పారిశుధ్య పనులు చేపట్టింది. సుమారుగా ఎనిమిది లారీల ప్లాస్టిక్ వ్యర్థాలు, పార్శిల్ పొట్లాలు, ఇతరాలు వచ్చాయి.

విశాఖలో నేవీ మ్యూజియాలకు రద్దీ

విశాఖపట్నంలో కైలాసగిరితో పాటు ఆర్‌కే బీచ్‌లో నేవీ ఏర్పాటుచేసిన కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ-142, సీ హ్యారియర్ యుద్ధ విమాన మ్యూజియాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వీటిని చూడడానికి పర్యాటకులు రెండు నుంచి మూడు కిలోమీటర్ల పొడవున క్యూలు కట్టి నిల్చొన్నారంటే అర్థం చేసుకోవచ్చు. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు బెంగాలీలు ఎక్కువగా విశాఖ వస్తుంటారు. వారితోపాటు ఒడిశా, తెలంగాణ వారు జత కలిశారు.

ఉత్సవ్‌లు లేకున్నా...ఆదరణ

పర్యాటకులను ఆకర్షించడానికి విశాఖ ఉత్సవ్, అరకు ఉత్సవ్, భీమిలి ఉత్సవ్‌లతో పాటు వీఎంఆర్‌డీఏ ఫ్లవర్ షోలను జిల్లా యంత్రాంగం నిర్వహించేది. డిసెంబరులో జరిగే ఈ ఉత్సవ్‌లతోనే పండుగ వాతావరణం వచ్చేది. కరోనా తరువాత రాష్ట్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం మానేసింది. జిల్లా యంత్రాంగం కూడా ఖర్చుకు భయపడి వెనకడుగు వేసింది.

టీడీపీ సీనియర్ల సేవలు చిరస్మరణీయం : ప్రగడ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక, జనవరి 21 : పార్టీలో సీనియర్ల సేవలు చిరస్మరణీయమని, వారి పేరిట క్రీడలు నిర్వహించడం అభినందనీయమని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం జయంతి సందర్భంగా నాగులాపల్లిలో వచ్చే నెల 17, 18, 19 తేదీలలో రాష్ట్రస్థాయి మహిళా ప్రో కబడ్డీ పోటీలను నిర్వహిస్తుండడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, టీడీపీ నేతలు భీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు, పెంటకోట విజయ్, మొల్లేటి సత్యనారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తా

» జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు


కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న సుందరపు

ఎలమంచిలి, జనవరి 21: నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నూతన మండల కార్యవర్గంతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలమంచిలిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఏళ్ల తరబడి ఆలస్యం కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల కమిటీ అధ్యక్షుడిగా అన్నం బాబ్జీ, సెక్రటరీగా సనా నానాజీ, వైస్ ప్రెసిడెంట్‌లుగా బీముని శివాజీ, శిలపరశెట్టి శ్రీను, ప్రచార విభాగం ప్రతినిధిగా బి.వెంకటరమణ, ట్రెజరర్ కర్రి బాబూరావు, జాయింట్ సెక్రటరీ డి.భగవాన్, మెంబర్లను ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు బైలపూడి శ్రీరామదాసు, పైలా రామునాయుడు, జనపరెడ్డి శ్రీనివాస్, పప్పల నూకన్నదొర, కొనగళ్ల రామకృష్ణ, కొలగాని భాస్కరరావు, బుల్లిబాబు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల సమ్మె విరమణకు చొరవ చూపాలి'

అనకాపల్లి టౌన్, జనవరి 21 : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయడానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బి. వెంకటరమణ, సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కన్వీనర్ పీఎస్ అజయ్‌కుమార్ జిల్లా కలెక్టర్‌ను ఒక లేఖలో కోరారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 41 రోజులుగా శాంతియుతంగా సమ్మె నిర్వహిస్తున్నారన్నారు. చర్చలు జరిపినప్పటికీ ప్రభుత్వం సానుకూల వైఖరి ప్రదర్శించని కారణంగా ఒక కొలిక్కి రాలేదన్నారు. వేతనాల పెంపును ప్రభుత్వం ఆమోదించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి అంగన్‌వాడీల డిమాండ్‌లను తీసుకువెళ్లి సమ్మె విరమింపజేయడానికి కృషి చేయాలని కలెక్టర్‌ను ఒక లేఖలో కోరారు.

పెదదొడ్డిగల్లులో ఉర్సు చందనోత్సవం


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు

నక్కపల్లి, జనవరి 21: మండలంలోని పెదదొడ్డిగల్లులో ఆదివారం హజరత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ రహమతులల్లా అలైహి ఉర్సు చందనోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం ఫజర్ నమాజ్ చేశారు. అనంతరం ఖురాన్ పఠనం చేశారు. ఈ పండుగ విశిష్టత గురించి ముస్లిం మత పెద్దలు వివరించారు. సాయంత్రం ఖ్వాజా బాబా చందనోత్సవం, అనంతరం ఊరేగింపు ఎంతో ఘనంగా జరిగింది. ఢంకా పార్టీ నిర్వహించారు. ఏడు ముస్లిం గ్రామాల్లో చందనోత్సవ ర్యాలీ చేశారు. కాకినాడకు చెందిన మౌలానా మహమ్మద్ రిజ్వీ ఇస్లాం ముఖ్య విషయాల గురించి ప్రసంగించారు. గ్రామ పెద్ద హైదర్ అలీ షింకా, సలామ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ కేవీ బాబా, ఏడు గ్రామాల మత పెద్ద ఖాజీ మకబుల్ అహ్మద్, రామకృష్ణాపురం ఇమాం ఖ్వాజా, మహబూబ్ సుభానీ, రంజాన్ అలీ, ఫరూక్, సింకా కాలేష పాల్గొన్నారు.

అయ్యప్పస్వాముల ఫ్యామిలీ పిక్నిక్

అనకాపల్లి టౌన్, జనవరి 21 : స్థానిక గవరపాలెం మందుగుండు సీతారామయ్య తోటలో గౌరీరైతు సంఘం అయ్యప్పస్వాముల ఫ్యామిలీ పిక్నిక్ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చలనచిత్ర దర్శకుడు నక్కిన త్రినాథరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నక్కిన త్రినాథరావును అయ్యప్పలు సత్కరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల పూర్ణచంద్రరావు, మళ్ల నరసింగరావు, కర్రి సన్యాసినాయుడు, మళ్ల సురేంద్ర, కోలపర్తి కన్నబాబు, శీలా జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

కొణతాల ఎంపీగా పోటీ చేయాలి

అనకాపల్లి టౌన్, జనవరి 21 : సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జనసేన పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేయాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ ఆకాంక్షించారు. ఆదివారం నిర్వహించిన కొణతాల అభిమానుల ఆత్మీయ సమావేశంలో రామకృష్ణను బీవీ రామ్ కలుసుకుని సత్కరించి అభినందించారు. రాబోయే ఎన్నికల్లో ఆయన ఎంపీగా పోటీ చేసి ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద


కొండుపాలెంలో కరపత్రాలను అందజేస్తున్న పీలా గోవింద

తుమ్మపాల, జనవరి 21 : టీడీపీతోనే మారుమూల గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చెప్పారు. ఆదివారం మండలంలోని కొండుపాలెంలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో గెలుపొంది టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శెట్టి వెంకటరమణ, డి.జగన్నాథం, దుల్లా వరలక్ష్మి, మదుపాడ పద్మావతి, మదుపాడ నరసింగరావు, తలారి కాశీనాయుడు, బాలాజీ, దాడి పెంటారావు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వేల్పులవీధి గౌరమ్మ జాతర

అనకాపల్లి టౌన్, జనవరి 21 : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల మహోత్సవం ముగిసింది. ఆదివారం కూడా పురవీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఉత్సవంలో భాగంగా శనివారం రాత్రి మెయిన్‌రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, చోడవరం రోడ్డుల్లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, బుర్రకథలు ఉత్సవాన్ని తిలకించడానికి వచ్చిన వారికి ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన బాణసంచా వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

'తాడి గ్రామం తరలింపునకు చర్యలు చేపట్టాలి'

పరవాడ, జనవరి 21 : ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామాన్ని తరలిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి 20 నెలలు కావస్తున్నా నేటికి ఎలాంటి ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. ఫార్మా కాలుష్యంతో గ్రామస్థులు ఉక్కిరిబిక్కిరవుతున్నారన్నారు. ఇప్పటికే గ్రామంలో భూగర్భజలాలు కలుషితమయ్యాయని, తాగునీరును కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాన్ని తరలించేందుక చర్యలు తీసుకోవాలని కోరారు.

'వ్యాయామ టీచర్లకు ఎస్‌పీసీఎల్ఎస్ ఇవ్వాలి'

ఎస్.రాయవరం, జనవరి 21: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొంటున్న వ్యాయామ ఉపాధ్యాయులందరికీ ప్రత్యేకంగా స్పెషల్ సీఎస్ (ఎస్‌పీసీఎల్ఎస్) ఇవ్వాలని కోరుతూ ఆదివారం పీఆర్‌టీయూ మండల నాయకులు జిల్లా అధ్యక్షులు డి. గోపీనాథ్, పెద్దినాయుడు విశ్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, కార్యదర్శి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు జగ్గవరపు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెదకలవలాపల్లిలో ఘనంగా కొత్తమ్మతల్లి తీర్థం

రాంబిల్లి, జనవరి 21 : మండలంలోని పెదకలవలాపల్లిలో ఆదివారం కొత్తమ్మతల్లి తీర్థం ఘనంగా జరిగింది. అమ్మవారిని స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. తీర్థం సందర్భంగా ప్రత్యేక భజనలు, కోలాటాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

శివాలయ పునర్నిర్మాణానికి రూ.4,69,487 విరాళం

సబ్బవరం, జనవరి 21 : మండల కేంద్రంలో పునర్నిర్మాణం చేస్తున్న శివాలయానికి దాతలు ఆదివారం భారీగా విరాళాలు అందజేశారు. ప్రముఖ న్యాయవాది బేతిన శ్రీనివాస్ రూ.1,11,051, వైసీపీ నాయకులు రూ. 1,66,660, వ్యాపారస్థులు ఈర్లె చిన్నారావు రూ.1,66,660, మాజీ వైస్ ఎంపీపీ కొటాన కోటయ్య రూ.25,116 ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గెద్దం కృష్ణ, బి నాని, ప్రకాష్, బర్ల రమణ, కొరాడ శ్రీను తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

'భారత్ అభివృద్ధే మోదీ లక్ష్యం'

సబ్బవరం, జనవరి 21 : భారత్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. మొగలిపురంలో ఆదివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచిపాటి సన్యాసిరావు, బీజేపీ మండల అధ్యక్షులు గొంప నరసింహారావు, అంగటి నానీ, ఐడీ బాబు పాల్గొన్నారు.

48 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు


బంగారమ్మపాలెం సమీపంలో కలిసిన పూర్వ విద్యార్థులు

సబ్బవరం, జనవరి 21: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో 1976-77లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం బంగారమ్మపాలెం సమీపంలో సమావేశమయ్యారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారంతా 48 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. చిలిపి చేష్టలు గుర్తుచేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ప్రతి ఏడాది సబ్బవరంలో కలుసుకునేందుకు వీలుగా ఒక భవనం నిర్మించేందుకు, తాము చదువుకున్న హైస్కూల్లో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగిరెడ్డి వెంకటరమణ, ఎస్.రామునాయుడు, గొర్లి సత్యనారాయణ, బోకం ముత్యాలనాయుడు, బి.నరసింహమూర్తి, నూకలక్ష్మి, కోటేశ్వరరావు, వెంకటరత్నం, భావనారాయణ, బోకం పైడితల్లి పాల్గొన్నారు.

నేడు టిడ్కో కాలనీలో హనుమాన్ విగ్రహావిష్కరణ

ఎలమంచిలి, జనవరి 21 : స్థానిక టిడ్కో గృహ సముదాయం వద్ద సోమవారం హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు కాలనీవాసులు తెలిపారు. ఇందుకోసం స్థానికులు ఆదివారం ఏర్పాట్లు చేశారు.

అల్యూమినియం కార్మికుల కూలీ రేట్లు పెంచాలి

తుమ్మపాల, జనవరి 21 : అల్యూమినియం కార్మికుల కూలీ రేట్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెంచాలని అల్యూమినియం వర్కర్స్ యూనియన్ మాజీ ప్రధానకార్యదర్శి బుద్ద భద్రరావు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో జరిగిన అల్యూమినియం వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల మజూరీ, కూలీ రేట్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కోన లక్ష్మణ, వైఎన్ భద్రం, పెంటకోట ప్రసాద్, పేర్రాజు, కర్రి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల తీర్థం

సబ్బవరం, జనవరి 21 : స్థానిక సీతారాముల తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి సీతారాములకు భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం సాముగరిడీలు, చిటికెన భజనలు నిర్వహించారు.

నర్సీపట్నం నియోజకవర్గం

గిరిజన గ్రామాల్లో దోమల విజృంభణ

- రాత్రివేళ కంటిమీద కునుకు ఉండడం లేదని గిరిజనుల ఆవేదన
- వెంటనే దోమతెరలు పంపిణీ చేయాలని వేడుకోలు



సుందరకోట పంచాయతీలోని కొండపై ఉన్న సిరిపురం

నాతవరం, జనవరి 21 : మండలంలో గిరిజన గ్రామాల్లో దోమల బెడద అధికమైంది. దీంతో రాత్రివేళ వారికి కంటిమీద కునుకు ఉండడం లేదు. ప్రధానంగా ఐదో షెడ్యూల్డ్‌లో ఉన్న సరుగుడు, సుందరకోట తదితర గిరిజన గ్రామాల ప్రజలు దోమతెరలు లేకపోవడం వలన దోమకాటుకు గురై తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. ఐదు సంవత్సరాల క్రితం నాతవరం మండలంలోని గిరిజన గ్రామాలతో పాటు మైదానప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ద్వారా దోమతెరలు పంపిణీ చేశారని వీరు చెపుతున్నారు. చాలా కాలం కావడంతో ప్రస్తుతం అవి చిరిగిపోయాయని అంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కొత్తవాటిని సరఫరా చేయాల్సిందిగా కోరారు. సరుగుడు, సుందరకోట పంచాయతీల వాసులు మాట్లాడుతూ కొండకోనల్లో అసౌకర్యాల నడుమ ఉన్న తమకు వీలైనంత త్వరగా దోమతెరలు అందించాలని వేడుకుంటున్నారు.

24న టీడీపీ, జనసేన కార్యకర్తల సమావేశం

నాతవరం, జనవరి 21 : ఇక్కడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈనెల 24వ తేదీ బుధవారం టీడీపీ, జనసేన పార్టీల మండల స్థాయి ఉమ్మడి సమన్వయ కార్యకర్తల సమావేశం జరగనుందని టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తెలిపారు. రానున్న ఎన్నికల్లో సమష్టిగా ఎలా పనిచేయాలని తదితర అంశాలపై చర్చించనున్నామన్నారు. ముఖ్య నాయకుల సమక్షంలో జరగనున్న ఈ సమావేశానికి ఇరుపార్టీల శ్రేణులు హాజరు కావాలని కోరారు.

ఎన్నికల్లో వైసీపీకి భంగపాటు తథ్యం

▸ జగన్ ప్రజా వ్యతిరేక పాలనపై అన్ని వర్గాలు విసుగు ▸ టీడీపీ హయాంలో నియోజకవర్గం 90శాతం అభివృద్ధి ▸ పార్టీ శ్రేణుల సమావేశాల్లో పద్మావతి, రాజేశ్



రావణాపల్లి సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

గొలుగొండ, జనవరి 21 : ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న వైసీపీకి త్వరలో జరగనున్న ఎన్నికల్లో భంగపాటు తప్పదని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి, మునిసిపల్ కౌన్సిలర్ చింతకాలయ పద్మావతి అన్నారు. మండలంలోని రావణాపల్లిలో ఆదివారం రాత్రి ఏర్పాటైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశంలో మాట్లాడారు. నర్సీపట్నం నియోజకవర్గం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తొంభైశాతం అభివృద్ధి చెందిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎక్కడా ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. ఇది గుర్తించిన ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ తరుణంలో టీడీపీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు మరింతగా వివరించాలని పిలుపునిచ్చారు.

ఇదిలావుంటే, పుత్తడిగైరంపేటలో పార్టీ శ్రేణులతో అయ్యన్న తనయుడు, కౌన్సిలర్ చింకాయల రాజేశ్ సమావేశమయ్యారు. రాష్ట్రం అభివృద్ధి పథాన పయనించాలంటే రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీని ఆశీర్వదించాలని కోరారు. నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు కొల్లి సత్యనారాయణ, కొల్లి రాంబాబు, పత్తి సత్తిబాబు, నారాయణమూర్తి, రూపల నాయుడు, బెల్లపు కొండలరావు, మండల తెలుగుయువత అధ్యక్షుడు కర్రి నాయుడు, ఆదపురెడ్డి గోపీలతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



పుత్తడిగైరంపేటలో మాట్లాడుతున్న రాజేశ్

ఎస్ఈబీ సీఐగా సునీల్‌కుమార్



సునీల్‌కుమార్

నర్సీపట్నం, జనవరి 21 : ఎస్ఈబీ సీఐ జి.శ్రీనివాస్‌కు ఇక్కడి నుంచి మన్యం జిల్లా పాలకొండకు బదిలీ అయ్యింది. ఈయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో పనిచేస్తున్న కె.సునీల్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

నేడు పట్టణంలో శ్రీరాముని శోభాయాత్ర

నర్సీపట్నం, జనవరి 21 : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు పట్టణంలోని వాసవీ కల్యాణ మండపం నుంచి ఐదు రోడ్ల జంక్షన్ మీదుగా దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం వరకు శ్రీరామ శోభాయాత్ర నిర్వహించనున్నామని వెలగా నారాయణరావు తెలిపారు. ఆది వారం ఇక్కడ కమిటీ సభ్యులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. శోభాయాత్ర అనంతరం ఉదయం 11 గంటలకు కోమటివీధి శ్రీరాముని ఆలయంలో శ్రీరామ రక్షాస్తోత్రం, హనుమాన్‌చాలిసా, శ్రీరామ మహామంత్ర పఠనం జరపనున్నామన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కట్టమూరి శేఖర్, పద్మనాభుని కన్నయ్యశెట్టి, దేవత అరుణ, ఉద్దగిరి శారద, చినబాబు పాలొన్నారు.

పుంజుకున్న పర్యాటకం

... 5వ పేజీ తరువాయి

పర్యటనలకు వెళ్లడం ప్రారంభించారు. ఇదే సమయాన అల్లూరి సీతారామరాజు జిల్లాలో శీతాకాలం ఎక్కడికక్కడ అందమైన మేఘాలు ఆవిష్కృతం కావడం, అవి సోషల్ మీడియా ద్వారా జనబాహుళ్యం దృష్టికి వెళ్లడంతో 'ఛలో ఏజెన్సీ' అంటూ అంతా వాహనాల్లో బయలుదేరిపోతున్నారు. గతంలో చింతపల్లి మండలం లంబసింగిలో మాత్రమే మేఘాల లోకం ఆవిష్కృతమయ్యేది. ఆ తరువాత పాడేరు సమీపాన వంజంగి, అరకులోయ వద్ద మాడగడ కూడా సందర్శనీయ ప్రాంతాలుగా మారాయి. ఇంకా మరికొన్ని ప్రాంతాలు కూడా అందుబాటులోకి రావడంతో సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది.

వంజంగిలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్

శీతాకాలంలో అక్టోబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఏజెన్సీకి సందర్శకులు పెద్ద సంఖ్యలో రావడం ఆనవాయితీ. ఈసారి డిసెంబరులో ఎక్కువ మంది రావడంతో సందర్శనీయ ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి.

రోజూ వేల సంఖ్యలు పర్యాటకులు రావడం, అందుకు తగ్గట్టుగా పారిశుధ్య పనులు అక్కడ చేపట్టలేకపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వంజంగిలో సందర్శకులకు వారం రోజులు అనుమతించబోమని ఐటీడీఏ ప్రకటించింది. జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు ఎవరినీ అక్కడికి రానీయకుండా పారిశుధ్య పనులు చేపట్టింది. సుమారుగా ఎనిమిది లారీల ప్లాస్టిక్ వ్యర్థాలు, పార్శిల్ పొట్లాలు, ఇతరాలు వచ్చాయి.

విశాఖలో నేవీ మ్యూజియాలకు రద్దీ

విశాఖపట్నంలో కైలాసగిరితో పాటు ఆర్కే బీచ్‌లో నేవీ ఏర్పాటు చేసిన కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ-142, సీ హ్యారియర్ యుద్ధ విమాన మ్యూజియాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వీటిని చూడడానికి పర్యాటకులు రెండు నుంచి మూడు కిలోమీటర్ల పొడవున క్యూలు కట్టి నిల్చొన్నారంటే అర్థం చేసుకోవచ్చు. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు బెంగాలీలు ఎక్కువగా విశాఖ వస్తుంటారు. వారితో పాటు ఒడిశా, తెలంగాణా వారు కూడా జత కలిశారు.

ఉత్సవ్‌లు లేకున్నా...ఆదరణ

పర్యాటకులను ఆకర్షించడానికి విశాఖ ఉత్సవ్, అరకు ఉత్సవ్, భీమిలి ఉత్సవ్‌లతో పాటు వీఎంఆర్‌డీఏ ఫ్లవర్ షోలను జిల్లా యంత్రాంగం నిర్వహించేది. డిసెంబరులో జరిగే ఈ ఉత్సవ్‌లతోనే పండుగ వాతావరణం వచ్చేది. కరోనా తరువాత రాష్ట్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం మానేసింది. జిల్లా యంత్రాంగం కూడా ఖర్చుకు భయపడి, నిధులు లేక వెనకడుగు వేసింది. అయినా సరే పర్యాటకులు అధిక సంఖ్యలో రావడం గమనార్హం.

అడుగడుగునా నిర్బంధం



విజయవాడ వెళ్లడానికి అనుమతించండి, లేదంటే ఇళ్ల వద్ద వదలిపెట్టాలంటూ అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద బైఠాయించిన అంగన్‌వాడీలు

.. 5వ పేజీ తరువాయి

తీసుకున్నారు. పోలీసుల తీరును సీఐటీయూ నాయకులు ఖండించారు.

పాయకరావుపేటలో ముందస్తు అరెస్టులు



పోలీసుల అదుపులో ఉన్న అంగన్‌వాడీలు

నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం విజయవాడలో జరిగే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వెళు తున్నట్టు సమాచారం రావడంతో ప్రభుత్వ ఆదేశాల మేర కు పాయకరావుపేట పోలీసులు ముందస్తు కట్టడి చర్యలకు దిగారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తను ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. సమస్యల పరిష్కారం కోరుతూ 41 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు పాయకరావుపేట తహసీల్దారు కార్యాలయం ఎదుట శిబిరం ఏర్పాటు చేసిన నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి పలువురు అంగన్‌వాడీలు విజయవాడ బయలుదేరుతున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో నిరసన శిబిరం వద్దకు వచ్చారు. అంగన్‌వాడీ వర్కర్లు కె.నూకరత్నం, పి.సత్యవేణి, కె.కుమారి, ఎం.నూకరత్నం, ఎన్.సత్యవతిలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తుని పోలీస్ స్టేషన్‌కు 'పట్నం అంగన్‌వాడీలు

నర్సీపట్నం, జనవరి 21: విజయవాడలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావం తెలపడానికి అనకాపల్లి జిల్లా నుంచి బయలుదేరిన పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను తునిలో పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకోవడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు అన్నారు. అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ పోలీసులు నిర్బంధించడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడి, అంగన్‌వాడీల డిమాండ్లను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని ఆయన కోరారు. కాగా నర్సీపట్నం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవాడ వెళ్లడానికి ఆదివారం సాయంత్రం తుని రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు... అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

చోడవరం నియోజకవర్గం

నేడు అయోధ్య రామయ్య ప్రచార ర్యాలీ

చోడవరం, జనవరి 21: అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా సోమవారం అయోధ్య రామయ్య ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్నట్టు రాయపురాజుపేట సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు తెలిపారు. సోమవారం ఉదయం 7గంటలకు శ్రీరామనామ భజనలు, సంకీర్తనలతో రాయపురాజుపేట నుంచి ప్రచార ర్యాలీ ప్రారంభమై వివిధ పంచాయతీల మీదుగా జుత్తాడలో ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రతీ పంచాయతీలోని రామాలయానికి రాముడి చిత్రపటం అందిస్తామన్నారు.

నేడు గోశాల ప్రారంభం

చోడవరం, జనవరి 21: పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరాయలంలో పవిత్ర గోశాల ప్రారంభోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధానార్చకులు కొడమంచిలి చలపతి తెలిపారు. ప్రవచనకర్త రామకృష్ణానంద గోశాలను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని భక్తులంతా జయప్రదం చేయాలని కోరారు.

నేడు కొత్తకోటలో మావూరి ఆడపడుచుల సమ్మేళనం

చోడవరం, జనవరి 21: జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన రావికమతం మండలం కొత్తకోటలో మావూరి ఆడపడుచుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. ఈ సమ్మేళనంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించడంతో పాటు, వైసీపీ పాలనలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలను వివరించనున్నామని వివరించారు.

వైసీపీ పాలన అంతంతోనే ఏపీకి పురోగతి

▸ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, జనవరి 21 : వైసీపీ పాలన అంతంతోనే ఏపీలో పురోగతి సాధ్యపడుతుందని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఆదివారం వడ్డాది పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జగన్ పాలనలో అన్నివర్గాలు అన్యాయానికి గురయ్యాయని విమర్శించారు. వైసీపీ తెచ్చిన భూ రక్షణ చట్టం అమల్లోకి వస్తే రైతులు అన్యాయానికి గురవుతారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత భూ రక్షణ చట్టాన్ని రద్దు చేసి, రైతులకు న్యాయం చేస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చినంతరం అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేనివాడు ఇక ప్రజలకు ఏం చేస్తాడని ప్రశ్నించారు.

గావో చలో అభియాన్‌ను విజయవంతం చేయండి

రోలుగుంట, జనవరి 21 : వచ్చే నెల 4వ తేదీ నుంచి జరిగే గావో చలో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కర్రి తమ్మునాయుడు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలు, పేదలకు కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

7 నుంచి గౌరీపరమేశ్వరుల జాతర



రోలుగుంట, జనవరి 21 : స్థానిక గౌరీ పరమేశ్వరుల జాతర మహోత్సవాలు ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా 7వ తేదీన బండిప్రభ ఏర్పాటుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 7, 8 తేదీల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జాతర ముగింపు ఉత్సవం 9వ తేదీన జరుగుతుందన్నారు. రాత్రి శ్రీదేవి డ్రామా కంపెనీ ప్రోగ్రాం సిటీ నటులతో కార్యక్రమం ఉంటుందన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువు

▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్

బుచ్చెయ్యపేట, జనవరి 21: వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలకు రక్షణ కరువైందని, వారికి రక్షణ కల్పించేందుకు టీడీపీ జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ఆదివారం పెదపూడి శివారు ఉప్పెరగూడెంలో జరిగిన టీడీపీ జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు స్థానిక సంస్థల్లో కల్పించిన రిజర్వేషన్లను తగ్గించి, 16 వేల మంది బీసీలకు జగన్‌రెడ్డి అవకాశాలు లేకుండా చేశారని విమర్శించారు. బీసీలకు చెందిన ఎనిమిది వేల ఎకరాల అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుని అన్యాయం చేశారన్నారు. జగన్ రెడ్డి ఏర్పాటు చేసిన 56 కార్పొరేషన్‌లకు నిధులు, విధులు లేకుండా చేశారని ఎద్దేవా చేశారు. జీఓ 217 తీసుకొచ్చి మత్స్యకారుల వెన్నెముక విరగొట్టారన్నారు. టీడీపీ బీసీ నేతలు యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడులపై అక్రమ కేసులు పెట్టి వేధించారనాన్నరు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే పొద్దుటూరులో టీడీపీ నాయకుడు సుబ్బయ్యను చంపేశారన్నారు. బీసీలకు రక్షణ చట్టం పేరిట మినీ మేనిఫెస్టోలో ఇప్పటికే టీడీపీ ప్రాధ్యానత ఇచ్చిందన్నారు. టీడీపీ అధికారంలో వచ్చాక బీసీలకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని నాగజగదీశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, బీసీ జిల్లా కోఆర్డినేటర్ గుర్రం నూకరాజు, దేవాంగుల జిల్లా కన్వీనర్ బత్తుల లక్ష్మి, రాష్ట్ర నగర సాధికార చైర్మన్ జంపెన శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, అరకు పార్లమెంట్ బీసీ కన్వీనర్ నక్కా రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, పార్టీ నాయకులు డొంకిన అప్పలనాయుడు, వియ్యపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

తారువలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

దేవరాపల్లి, జనవరి 21: మండలంలోని తారువలో రూ.3.76 కోట్లతో ఏర్పాటు చేసిన 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదివారం ప్రారంభించారు. అంతకుముందు మర్లమాంబ గ్రామ దేవతను దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ.. తారువ, తిమిరాం, వాకపల్లి, చీడికాడ మండలం నీలంపేట, కొత్తూరు, చీడిపల్లి గ్రామాల ప్రజలు లోఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడేవారని, ఇక్కడ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో ఈ సమస్య తొలగిందన్నారు. అనంతరం జల జీవన్ మిషన్ ఇంటింటా కొళాయిలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జడ్పీటీసీ సభ్యులు కర్రి సత్యం, అనూరాధ, సర్పంచ్ వరహాలమ్మ, కిలపర్తి బాస్కరరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్, ఈఈ వీడీపీ.రామకృష్ణ, ఈఈ చెల్లిబాబు, డిఈఈ అప్పలనాయుడు, ఏఈఈ కర్రిశంకరరావు తదితరులు పాల్గొన్నారు. సబ్ స్టేషన్‌కు అవసరమైన 50 సెంట్లు భూమి దానం చేసిన తమ్మునాయుడును ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు అభినందించారు.



తారువలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ముత్యాలనాయుడు

కస్పా కాలువలో పూడికతీత

▸ రైతుల విరాళాలతో పనులు



కస్పా కాలువ పూడికతీస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట, జనవరి 21 : ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు చేతులెత్తేయడంతో రైతులే ముందుకు వచ్చి కస్పా కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. పెద్దేరు రిజర్వాయర్ నీరు వడ్డాది పెద్దేరు గ్రోయిన్ నుంచి కస్పా కాలువ ద్వారా 1,600 ఎకరాల కస్పా భూములకు అందుతుంది. నిధులు లేకపోవడంతో ఇరిగేషన్ శాఖ మూడేళ్లగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో కస్పా ఆయకట్టు నీరు అందక పంటలను నష్టపోవలసి వచ్చింది. కస్పా కాలువ పూడికతీత పనులు చేపట్టాలన్న వడ్డాది, చినప్పన్నపాలెం, పొలేపల్లి గ్రామాల రైతులు విజ్ఞప్తులను అధికారులతో పాటు పాలకులు పట్టించుకోలేదు. రబీ సాగుతోనైనా తిండి గింజలు దక్కించుకోవాలని మూడు గ్రామాలకు చెందిన రైతులు విరాళాలు వేసుకొని ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పనులను కస్పా కాలువ మాజీ చైర్మన్ దాడి గోవిందరావు చేయిస్తున్నారు.

నేడు సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాల ప్రతిష్ఠ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రమణ దంపతులు

రావికమతం, జనవరి 21: మండలంలో తట్టబందలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలను సోమవారం ప్రతిష్ఠించనున్నట్టు గ్రామ సర్పంచ్ గోకివాడ రమణ తెలిపారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సమయంలోనే ఇక్కడ కార్యక్రమం జరుగుతుందన్నారు. గత రెండు రోజులుగా ఆలయంలో సింహాచలం దేవస్థానం పురోహితులతో హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారన్నారు. ఆదివారం గణపతి హోమం నిర్వహించారన్నారు. ఆలయ నిర్మాణానికి తమ కుటుంబం రూ.3.5 లక్షలు విరాళంగా అందజేశామన్నారు. ఈ పూజా కార్యక్రమానికి గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

రసవత్తరంగా ఎడ్ల పరుగు ప్రదర్శన



బి.కింతాడలో పోటీపడుతున్న ఎడ్లజత

దేవరాపల్లి, జనవరి 21: మండంలోని బి.కింతాడలో మరిడిమాంబ తీర్థం సందర్భంగా జరిగిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో సింహాద్రిపురం ఎడ్ల జతకు ప్రథమ బహుమతి వచ్చింది. ఆదివారం జరిగిన ఈ పోటీలు రసవత్తరంగా జరిగాయి ద్వితీయ స్థానం హర్షవర్ధన్ నాయుడు (దండిసురవరం), మూడో స్థానం సంపత్‌వినాయక (నర్సాపురం), మజ్జి రాజేష్ (చుక్కపల్లి), నాలుగో స్థానం, అద్దెపల్లి అనిల్‌కుమార్ (చుక్కపల్లి) ఎడ్లు సాధించాయి. విజేతలకు బూరే బాబూరావు, దాసరి వెంకునాయుడు, అన్నంరామునాయుడు, కొమిర బాబూరావు, వెంకటరావు బహుమతులు అందజేశారు.

భీమిలిలో సభ విజయవంతం చేయాలి : ధర్మశ్రీ

చోడవరం, జనవరి21: భీమిలిలో ఈనెల 27న జరగనున్న సీఎం జగన్ సభ విజయవంతానికి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కోరారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ నాయకులు, సర్పంచులు, గృహసారథులు, ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం సభకు ప్రతీ పంచాయతీనుంచి జనాన్ని తరలించాలన్నారు. అధికారంలోకి వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని, కష్టపడి పనిచేసిన కార్యకర్తలందరికీ గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మండల పార్టీ అధ్యక్షుడు డీవీ ఆర్, ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, సీనియర్ నాయకులు బొడ్డేడ సూర్యనారాయణ, వెంపలి ఆనంద్, నెహ్రూ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రావికమతంలో.. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు కృషిచేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం సాయంత్రం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు చేట్టాలన్నారు.ఈనెల 27న భీమునిపట్నంలో జరిగే సీఎం జగన్ సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం బీఎన్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, త్వరగతిన పనులు పూర్తిచేయాలని ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, పార్టీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, కంచిపాటి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ శోభా యాత్రను విజయవంతం చేయండి

రోలుగుంట, జనవరి 21 : అయోధ్య శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం రోలుగుంటలో శ్రీరామ శోభా యాత్రను నిర్వహిస్తున్నట్టు సమసరతా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాసరావు, రమేష్ తెలిపారు. ఆదివారం స్థానిక రామాలయంలో వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు, భజన బృందాల కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వినాయక గుడివద్ద నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు.

అంగన్‌వాడీల సమ్మె విరమణకు ప్రభుత్వం చొరవ చూపాలి

అనకాపల్లి టౌన్, జనవరి 21 : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయడానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బి. వెంకటరమణ, సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కన్వీనర్ పీఎస్ అజయ్‌కుమార్ జిల్లా కలెక్టర్‌ను ఒక లేఖలో కోరారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 41 రోజులుగా శాంతియుతంగా సమ్మె నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం తరుపున సమస్యల పరిష్కారం కోసం మంత్రులు, అధికారులు, అంగన్‌వాడీ కార్మిక నాయకులు చర్చలు జరిపినప్పటికీ ప్రభుత్వం సానుకూల వైఖరి ప్రదర్శించని కారణంగా ఒక కొలిక్కి రాలేదన్నారు. వేతనాల పెంపును ప్రభుత్వం ఆమోదించాలని కోరారు. వారి సమస్యల పరిష్కారం కోసం నిర్దిష్టమైన హామీ ఇవ్వకుండా సమ్మె విరమింపజేయాలని వత్తిడి చేయడం భావ్యం కాదన్నారు. ప్రభుత్వం దృష్టికి అంగన్‌వాడీల డిమాండ్‌లను తీసుకువెళ్లి సమ్మె విరమింపజేయడానికి కృషి చేయాలని కలెక్టర్‌ను ఒక లేఖలో కోరారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు ఎస్‌పీసీఎల్ఎస్ ఇవ్వాలి

ఎస్.రాయవరం, జనవరి 21: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొంటున్న వ్యాయామ ఉపాధ్యాయులందరికీ ప్రత్యేకంగా స్పెషల్ సీఎస్ (ఎస్‌పీసీఎల్ఎస్) ఇవ్వాలని కోరుతూ ఆదివారం పీఆర్‌టీయూ మండల నాయకులు జిల్లా అధ్యక్షులు డి. గోపినాథ్, పెద్దినాయుడు విశ్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, కార్యదర్శి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు జగ్గవరపు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గం

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండుగ



భక్తులు తెచ్చిన ఘటాలతో కిటకిటలాడిన ఆలయం

మాడుగుల, జనవరి 21 : స్థానిక మోదకొండమ్మకు ఆదివారం భక్తులు ఘటాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు భక్తులు అమ్మవారికి ఘటాల పండుగను నిర్వహించారు. భక్తులకు స్థానిక న్యాయవాది శ్రీనాథ ప్రసాదరావు, ప్రమోద్‌ల ఆధ్వర్యంలో ఉచిత భోజన సదుపాయాన్ని కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పరాజు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సీఎం సభకు తరలిరావాలి

▸ ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

చీడికాడ, జనవరి 21: ఈనెల 27న భీమిలిలో జరిగే వైసీపీ ఉత్తరాంధ్ర స్థాయి సమావేశానికి మండలం నుంచి అధిక సంఖ్యలో జనాన్ని తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కోరారు. ఆదివారం అప్పలరాజుపురంలో వైసీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంల వైసీపీ నేతలు గొల్లవిల్లి రాజబాబు, గొల్లవిల్లి స్వామినాయుడు, సుంకరి శ్రీనివాసరావు, పడాల అప్పలనాయుడు, చుక్క అప్పలనాయుడు, కసిరెడ్డి రామకృష్ణ, లాలం జానకీరామ్, తదితరులు పాల్గొన్నారు.

సత్యవరం తీర్థంలో కోడిపందాలు



సత్యవరంలో కోడిపందెం నిర్వహిస్తున్న దృశ్యం

మాడుగుల, జనవరి 21 : మండలంలో సత్యవరంలో ఆదివారం మరిడిమాంబ తీర్థం జరిగింది. గ్రామ సమీపంలో ఏటి ఒడ్డున గల కళ్లాల వద్ద ఉదయం పదకొండు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కోడిపందాలు జరిగాయి. కోడిపందాలు జరుగుతున్న సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వచ్చేసరికి పందెంరాయుళ్లు అక్కడ నుంచి జారుకున్నారు. దీనిపై ఎస్ఐ దామోదరనాయుడు వద్ద ప్రస్తావించగా.. తీర్థం కారణంగా కోడిపందాలు జరగకుండా సిబ్బందిని పంపించామన్నారు. కానీ ఎవరూ పట్టుబడలేదు. కోడిపందాలు జరిగితే తీర్థం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

వీరనారాయణంలో గడ్డివాము దగ్ధం

మాడుగుల రూరల్, జనవరి 21 : మండలంలోని వీరనారాయణంలో ఆదివారం గడ్డివాము అగ్నికి దగ్ధమైంది. స్థానిక రైతు మళ్ల రాముకి చెందిన గడ్డివాముకి మంటలు అంటుకోవడంతో స్థానికులు మంటలను అదుపు చేస్తూ మాడుగుల అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. సుమారు రూ.20వేలు ఆస్తినష్టం వాటిల్లినట్టు అంచనా వేస్తున్నామని, కేర్ లెస్ స్మోకింగ్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని ఫైర్ ఆఫీసర్ రాజేశ్వరరావు తెలిపారు.